విద్యార్థి నాయకుల అరెస్టు


పోలీసుల అదుపులో కార్యకర్తలు

కేపీహెచ్‌బీకాలనీ: చలో హెచ్‌సీయూ కార్యక్రమం సందర్భంగా గురువారం ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని నేతలు హెచ్చరించారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

బాలానగర్ : బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. గత నెల 30వ తేదీన ఎస్‌ఎస్‌కెకె పాఠశాల ఆవరణలో మలయాళ మిషన్ తెలంగాణ చాప్టర్ అనే ప్రోగ్రాంను నిర్వహించారు. అందులో హేమ రవికుమార్ (52) అనే మహిళ పాల్గొన్నారు. అదే కార్యక్రమాన్ని వీక్షించడానికి అనిల్ కురియా కోస్ అనే వ్యక్తి తాగి వచ్చి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 34వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీవారి అష్టోత్తర కలశ స్థాపన 250 కలశములతో ఏకాదశ వలపల రసస్నపన, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం శేష వాహన సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీవారి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. గురువారం శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా శేరిలింగంపల్లిలోని హెచ్‌సీయూలో జరుగుతున్న విధ్వంసంను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఇప్పటికే ప్రజలు గమనిస్తున్నారని, నాడు కేసీఆర్ ప్రకృతిని కాపాడుతూ హరిత హారం పేరుతో చెట్లు నాటారన్నారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, ప్రతి కార్యకర్తను కూడా పార్టీ గుర్తు పెట్టుకొని వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ నెల 27న జరిగే ప్లీనరీని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, నాయకులు సతీష్ రావు, శ్రీనివాస్‌రావు, రోజా, కిరణ్‌యాదవ్, శ్రీనివాస్, ముజీద్, రవి యాదవ్, శ్రీకాంత్, సాయి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షం.. రోడ్లు జలమయం

- చిన్నపాటి కుంటలను తలపించిన రోడ్లు
- స్తంభించిన రాకపోకలు
- ఇళ్లలోకి వర్షపు నీరు


వర్షం కారణంగా ఇళ్లలోకి వచ్చిన నీరు


వర్షపు నీటిలో మునిగిన కార్లు




రెడ్డి చికెన్‌షాపు ఎదురు వీధిలో వర్షపు నీరు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఒకపక్క ఎండ వేడిమి, ఉక్కపోత మరోపక్క భారీ వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా ఎండకు, ఉక్కపోతకు ఉక్కిరి బిక్కిరి అవుతున్న తరుణంలో గురువారం కురిసిన భారీ వర్షానికి చల్లదనం ఏర్పడినప్పటికి ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాహనదారుల రాకపోకలను తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కురిసిన వర్షానికి ఆయా ప్రాంతాల రహదారులు జలమయం అయ్యాయి. వర్షపునీటితో ప్రధాన రోడ్లు, కాలనీలలోని రోడ్లు చిన్నపాటి చెరువును తలపించాయి. సమతానగర్‌లోని రోడ్డు నంబర్ 3, 5, 7, సిండికేట్ బ్యాంక్ కాలనీ, బృందావన్ కాలనీ, మానస సరోవర్ హైట్స్, కల్యాణ్ థియేటర్ ముందు, కళింగ ఎన్‌క్లేవ్, శ్రీ సాయి ఎన్‌క్లేవ్, హస్మత్‌పేట, అంజయ్యనగర్ ప్రాంతాలలో రహదారులు నీట మునిగాయి. సమతానగర్‌లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇంటి ముందు పార్కు చేసిన కార్లు, బైకులు నీట మునిగాయి.

మూసాపేట: మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని రెడ్డి చికెన్‌షాపు ఎదుట వీధిలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. మ్యాన్ హోల్ మూతలో నుంచి నీరు డ్రైనేజీ లైన్‌లో వెళ్లటం తప్పితే నీరు వెళ్లే మార్గం లేదు. డ్రైనేజీ నిండి ఆ నీరు కూడా బయటకు వస్తుంటే ఇళ్లలోకి నీరు వెళ్లాల్సిందే. కాలనీ వాసులు ఆందోళన చెందారు.

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడ రైల్వే ట్రాక్ సమీపంలో గల మధ్యన ఉన్న ఓపెన్‌నాలాలో గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి నాలా నిండింది. ఇళ్ల మధ్యలో నీళ్లు రోడ్డుపై నిలిచిపోయాయి. అంతేకాకుండా నాలాలో చెత్తా చెదారం నిండి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అవంతినగర్ తోట నాలా పక్కన రోడ్డు పై వర్షం నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వెంటనే జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఆయా ప్రాంతాలలో ఇళ్ల మధ్యన, రోడ్లపై నిలిచిన వర్షపు నీటితో పాటు మురుగునీరు సక్రమంగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు.


బబ్బుగూడ ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగునీరు


చిన్నపాటి కుంటను తలపిస్తున్న రోడ్డు

రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: వెంకట పాపయ్య నగర్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఏఐ శ్రావణి, కాలనీ వాసులతో కలిసి కాలనీలో పర్యటించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు పూర్తి చేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, జూపల్లి జనార్దన్‌రావు, దేవేందర్‌రావు, నరసింహులు, జీవన్‌రెడ్డి, అంకంరావు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములను కాపాడుకోవాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: హెచ్‌సీయూ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వంశీరెడ్డి అన్నారు. గురువారం వివేకానంద స్వామి విగ్రహం వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అడవులను కాపాడాల్సిన పాలకులు నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో శ్రీహరి యాదవ్, నర్సింగరావు, శంకరన్న, శ్రీనివాస్, గోపాల్‌రావు, రేషన్ రాజు, భాస్కర్ రెడ్డి, వేణు, మమత, జయ శ్రీ, రేణుక, సందీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలు వెళ్లకుండా గేట్ల ఏర్పాటు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కెఎస్ నగర్, రాజీవ్ గాంధీనగర్ మధ్యలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద నుంచి నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో స్థానికంగా నివసిస్తున్న ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్న ఫిర్యాదుతో కార్పొరేటర్ సబిహా బేగం గురువారం రైల్వే అధికారులతో మాట్లాడారు. తక్షణమే రైల్వే అధికారులు స్పందించి భారీ వాహనాలు వెళ్లకుండా భారీ గేట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రియాజ్, అస్లాం, మల్లేష్, రాంబాబు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో అద్భుత ఫలితాలు

- వీసీ కిషన్‌కుమార్ రెడ్డి


వర్కుషాపును ప్రారంభిస్తున్న వీసీ, ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్‌రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కృత్రిమ మేధస్సుతో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని, విద్యార్థులు దానిని ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జేఎన్‌టీయూహెచ్ వీసీ టి. కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ ఐటీ తరఫున సీఆర్‌సీలో స్పిరిట్ 2025 ఫెస్టివల్‌లో భాగంగా జనరేటివ్ 'ఏఐ వర్కుషాపు'ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సును ప్రతి రంగంలో ఉపయోగించవచ్చన్నారు. కార్యక్రమంలో వర్కు షాపు ఫ్యాకల్టీ నవీన్‌కుమార్, స్టూడెంట్ కోఆర్డినేటర్ సుకుమార్ రెడ్డి, కార్తికేయ శర్మ, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల డిమాండ్ మేరకు బస్సులు : ఆర్‌ఎం


ఆర్టీసీ ఆర్‌ఎం అపర్ణ కల్యాణి

మూసాపేట: ప్రజల డిమాండ్ మేరకు కాలనీలు, మిగతా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ కూకట్‌పల్లి డిప్యూటి రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి అన్నారు. గురువారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లోని డిప్యూటి ఆర్‌ఎం కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూకట్‌పల్లి, మియాపూర్-2, జీడిమెట్ల, హెచ్‌సీయూ, మేడ్చల్ డిపోలు తమ పరిధిలో ఉన్నాయని, సుమారు 711 బస్సులు నడుస్తున్నాయన్నారు. మరో 25 మెట్రో డీలక్స్ బస్సులు కొత్తవి వస్తున్నాయని తెలిపారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకునేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను బలిగొన్న చరిత్ర బీఆర్‌ఎస్‌దే..

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

బాలానగర్: తెలంగాణ ఉద్యమం పేరుతో 1200 మంది విద్యార్థులను బలిగొన్న చరిత్ర బీఆర్‌దేనని, ఇప్పుడు విద్యార్థుల గురించి కపటప్రేమ చూపిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల వివాదాన్ని విద్యార్థుల ముందు పెట్టి రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్‌సీయూ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని విమర్శించడంపై సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం, స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు శిక్షణ, దేశంలోనే ఎక్కడా లేని విధంగా లబ్ధిదారులకు సన్న బియ్యం వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కేసీఆర్ చెప్పిన డబుల్ బెడ్ రూం ఇళ్లు , రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు, లక్ష్మయ్య, దండుగుల యాదగిరి, పుష్పారెడ్డి, గోపిశెట్టి రాఘవేంద్ర, కుక్కల రమేష్, మేకల రమేష్, మధు గౌడ్, శివ చౌదరి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం తినండి.. ఆరోగ్యంగా ఉండండి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం తిని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటలోని ఓ రేషన్‌షాపులో తెల్ల రేషన్ కార్డుదారులకు టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నల్లోల రాజేందర్, అస్లాం సోఫీతో కలిసి సన్న బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రభుత్వంలో పేద ప్రజలకు మేలే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో షాయిన్‌షా, మల్లికార్జున యాదవ్, దండుగుల అశోక్, కనకరాజుయాదవ్, శ్రీరాములు, కాసు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరగకుండా చర్యలు

మోతీనగర్: అకాల వర్షానికి బబ్బుగూడ నాలా నిండి ఇళ్లలోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి నాలా ప్రవాహాన్ని పరిశీలించారు. నాలాలో చెత్తా, చెదారం పేరుకుపోయి ప్రవాహానికి అడ్డు తగులుతుందని గమనించి అధికారులకు సమస్యను వివరించి మాట్లాడారు. ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి, బోడ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకటేష్, హరిబాబు, రాజ్‌కుమార్, సుందర్, మణిరాజ్ గౌడ్, అజామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


నాలాను పరిశీలిస్తున్న శ్రావణ్‌కుమార్

తొలి అమరుడు దొడ్డి కొమురయ్య

- వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా జయంతి

ఓల్డ్ బోయిన్‌పల్లి: రైతాంగ సాయుధ పోరాటాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లిన వీరుడు దొడ్డి కొమరయ్య అని, రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన ఘనత ఆయనకే దక్కిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య 98వ జయంతి సందర్భంగా కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో హస్మత్‌పేట చెరువు కట్ట సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కనకరాజుయాదవ్, సాయిల్లా ఐలేష్, లింగం, పోచయ్య, బండారి తిరుపతి, సమ్మయ్య, ఇర్ఫాన్, మేకల హరినాథ్, నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, బాల్‌రాజు, కర్రె జంగయ్య, సత్యనారాయణ, యాదగిరి, రాజుగౌడ్, వాసు, ఉమా, మల్లేష్ పాల్గొన్నారు.


కొమురయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్


నివాళులర్పిస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ..

కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొమురయ్య జయంతిని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమంలో నాయకులు షాయిన్‌షా, కనకరాజు యాదవ్, శ్రీరాములు, కాసు అశోక్, సందీప్, మోహన్, నర్సింహ పాల్గొన్నారు.

బీజేపీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

బీజేపీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకులు మక్కాల నర్సింగ్‌రావు, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇటుక శ్రీకిషన్ మాదిగ, బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లోల రాజేందర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్యాగరి నర్సింహ, మంద మధుకర్ మాదిగ, మక్కాల అశోక్, రంజిత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య, ఛత్రపతి శివాజీకి..

మోతీనగర్: హిందూ వాహిని కూకట్‌పల్లి బాగ్ సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్, గాయత్రినగర్ గాంధీ విగ్రహం వద్ద దొడ్డి కొమురయ్య జయంతి, ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించాలి


రామాలయంలో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రామాలయంలో శ్రీరామనవమి ఏర్పాట్లుకు సంబంధించి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లు గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఎక్కడిక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి సందర్భంగా మంచినీరు అందేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. 4వ తేదీ నుంచి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని ఆలయ ఈవో, చైర్మన్‌లకు సూచించారు. భక్తులకు భోజనం, ప్రసాదం ఇవ్వాలని తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. 436 ఏళ్ల చరిత్ర గల ఈ కూకట్‌పల్లి రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి రంగారావు, మాజీ కార్పొరేటర్‌లు మాధవరం రంగారావు, పగుడాల బాబురావు, చైర్మన్ తులసీరావు, ఆలయ ఈఓ ఆంజనేయులు, కూకట్‌పల్లి శివాలయం మాజీ చైర్మన్ సూర్యారావు, ఆలయ సిబ్బంది, శానిటేషన్, శాంతి భద్రతలు, ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్సుఅధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

నియోజకవర్గంలోని చెరువులు, నాలాల అభివృద్ధి క్రమంలో ఇబ్బందులు కలుగకుండా ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులు, నాలాల అభివృద్ధికి సంబంధించి నిధులు మంజూరై పనులు ప్రారంభించిన వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సున్నం చెరువుకు కల్వర్టు నిర్మించాలని, స్థానికులకు సరైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఐడీఎల్ చెరువు నుంచి కూకట్‌పల్లి డిపో వరకు నాలా అభివృద్ధి పనులను పర్యవేక్షించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫతేనగర్‌లోని దీన్‌దయాల్‌నగర్ నాలా వద్ద ఇక్కడి నిరుపేదలకు ఇబ్బంది లేకుండా స్థలాన్ని సేకరించి చెరువు సుందరీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, సబిహా బేగం, పండాల సతీష్ గౌడ్, ముద్దం నరసింహ యాదవ్, శిరీష బాబురావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, హెచ్‌ఎండీఏ, ఎస్‌ఎన్‌డీపీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ

సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కూకట్‌పల్లిలోని పౌరసరఫరాల శాఖ కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ ప్రారంభించారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.


సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు